నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 | హైదరాబాద్, శుక్రవారం 15 మార్చి 2024 | VIKARABAD

పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 14(నమస్తే తెలంగాణ) : ఎలాంటి పొరపాట్లు జరగకుండా పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక సంబంధిత పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో 239 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా హాల్ లోకి వెళ్లేముందు ప్రతి విద్యార్థిని తనిఖీ చేయాలన్నారు. మొబైల్ ఫోన్లను అనుమతించవద్దని, హాల్ టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడుపాలన్నారు. పరీక్ష కేంద్రంలో మొబైల్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఆశా వర్కర్‌తోపాటు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఇన్విజిలేటర్లు పరీక్ష సమయానికి ముందే రావాలని చివరిదాకా ఉండాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్లు పటిష్టంగా పర్యవేక్షణ జరుపాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

పంట పాలాలు పడావుగా..

కరెంట్ కోతలు, సాగునీటి కొరత.. ఆందోళనలో అన్నదాత

గత యాసంగి, ప్రస్తుత యాసంగిలో పంటల సాగు వివరాలు ఎకరాల్లో..

పంట	2022-23లో సాగు విస్తీర్ణం	2023-24లో సాగు విస్తీర్ణం
వరి	90,447	83,111
జొన్న	656	1,708
మొక్క జొన్న	13,530	6,150
వేరు శనగ	4,439	1,413
పొద్దు తిరుగుడు	660	430
కుసుమ	5,297	2,166
ఇతర పంటలు	2,982	1,483
మొత్తం	1,23,240	1,03,946

రంగారెడ్డి జిల్లాలో గణనీయంగా తగ్గిన యాసంగి సాగు

పాతాళానికి పడిపోతున్న భూగర్భ జలాలు..

జిల్లాలో అలుముకుంటున్న కరువు ఛాయలు

గత యాసంగి కంటే 20 వేల ఎకరాలు తగ్గిన సాగు విస్తీర్ణం

ఎండుతున్న పంటలతో ఆవిరవుతున్న రైతన్నల ఆశలు

రంగారెడ్డి, మార్చి 14(నమస్తే తెలంగాణ): భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతుండడంతో. వ్యవసాయానికి ప్రతికూల పరిస్థితులు నెలకొంటున్నాయి. నీరు లేక జిల్లాలో ఈసారి యాసంగిలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గత యాసంగితో పోలిస్తే ఈసారి పంటల విస్తీర్ణం 20వేల ఎకరాలు తగ్గింది. అరకొరగా సాగు చేసిన పంటలకు సైతం సాగు నీటి కొరత ఏర్పడడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పంటలను రక్షించుకునే ప్రయత్నంలో రైతన్నలు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో పంటల దిగుబడులపైనా అన్నదాతల ఆశలు సన్నగిల్లుతున్నాయి.

ఈసారి పంటలుడీలా..

జిల్లాలో యాసంగి పంటల సాగు లెక్కను వ్యవసాయ శాఖ అధికారులు తేల్చారు. క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి సాగు నివేదికను రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 1,03,946 ఎకరాల్లో మాత్రమే యాసంగి పంటలు సాగయ్యాయి. పంటల వివరాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. రైతుల వారీగా సర్వే నంబరు, సాగు విస్తీర్ణంతోపాటు, వేసిన పంట, నీటి వసతి తదితర వివరాలను సమగ్రంగా సేకరించారు. గత ఏడాది యాసంగిలో సాగు నీరు, కరెంటు తదితర వనరుల పుష్కలంగా ఉండడంతో జిల్లా రైతాంగం 1,23,240 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేసింది. అయితే ఈసారి యాసంగిలో గతంలో ఎన్నడూ లేని గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రైతులు గత యాసంగి కంటే 20వేల ఎకరాల్లో తక్కువగా ఈసారి పంటలను సాగు చేశారు. గత యాసంగిలో వరి సాగు 90,447 ఎకరాలు ఉంటే.. ప్రస్తుత యాసంగిలో 83,110 ఎకరాల్లో మాత్రమే సాగైంది. మక్క జొన్న గత సీజన్‌లో 13,530 ఎకరాలు ఉంటే.. ఈసారి 6,150 ఎకరాలకే పరిమితమైంది. సీజన్ ఆరంభం నుంచే పంటల సాగుకు రైతన్నలకు ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. పెట్టుబడులకు ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకపోవడంతోపాటు కరెంటు కోతలను విధించింది. దీనికితోడు సరైన వర్షాలు లేక బోరు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటి పంటలకు నీరందని దుస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో పంటలను సాగు చేసే సాహసాన్ని రైతన్నలు చేయక పొలాలను పడావుగా ఉంచారు.

మరోపక్క ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంపైననూ రైతుల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి. చాలా చోట్ల పంటలు వాడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏదిఏ మైనా..ఈసారి యాసంగిలో పంటల సాగు విషయంలో అందరి అంచనాలు తలకిందులయ్యాయి.

ఆందోళన కలిగిస్తున్న కరువు ఛాయలు

జిల్లాలో సాధారణ వర్షపాతం 660.5మి.మీ.లుకాగా, 656మి.మీ.ల వర్షం మాత్రమే కురిసింది. ఐదు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. 19 మండలాల్లో సాధారణ వర్షపాతం కురవగా..మూడు మండలాల్లో సాధరణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జనవరిలో 9.84మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు ఫిబ్రవరి నాటికి మరింత లోతుకు పడిపోయాయి. 12 మీటర్ల లోతుకు పడిపోవడంతో 500 అడుగుల లోతులో బోర్లు వేసినా నీరు పడే పరిస్థితి లేకుండా పోయింది. జిల్లాలో మెజార్టీ పంటలు బోర్లు, బావుల కిందనే సాగవుతున్నాయి. భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతుండడంతో నీటి వనరుల్లో నీటి మట్టాలు అడుగంటుతున్నాయి. కళ్లెదుటే పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని రైతులు పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. పంటలతోపాటు కూరగాయల సాగు సైతం ప్రస్తుత సీజన్‌లో గణనీయంగా తగ్గింది. దీంతో కూరగాయలు, పండ్లు, పూల దిగుబడులు తగ్గిపోయి మార్కెట్లో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. వరితోపాటు వివిధ రకాల సాగు తగ్గడంతో వాటి ధరల పెంపుపై ప్రభావాన్ని చూపుతున్నాయి. కొన్నాళ్లక్రితం వరకు రూ.4వేలు ఉన్న క్వింటాల్ బియ్యం ధర రూ.6వేలకు పైగానే పలుకుతోంది.

వన్యప్రాణుల దప్పిక తీర్చేలా..

వికారాబాద్ జిల్లాలోని అడవుల్లో 108 సాసర్ పిట్లు ఏర్పాటు

- రెండు రోజులకొకసారి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- జంతువులు, పక్షుల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్న అటవీ శాఖ అధికారులు
- వికారాబాద్ రేంజ్ పరిధిలో 31, పరిగి రేంజ్ పరిధిలో 30 సాసర్ పిట్ల ఏర్పాటు

వికారాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): వేసవి కాలం ప్రారంభమైన దృష్ట్యా వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు జిల్లా అటవీశాఖ అధికారులు చర్య లు చేపట్టారు. రోజురోజుకూ ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వాటికి ప్రాణాపాయం లేకుండా వికారాబాద్ రేంజ్‌తోపాటు మిగతా అన్ని రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో 108 సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. వాటిలో రెండు రోజు లకొకసారి నీటిని నింపి దప్పికను తీర్చుతున్నారు. గతంలో వన్యప్రాణులు దాహం తీర్చుకునేందుకు పూడూరు మండలంలోని సోమన్‌గుర్తి గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలోకి దిగి మృతిచెందిన ఘటనతోపాటు అదే మండలంలోని దామగుండం కోనేరులో పడి జింకలు మృత్యువాత పడిన ఘటనలున్నాయి. అయితే ఇలాంటివి జరుగకుండా జిల్లా అటవీశాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. అయితే జిల్లాలో మొత్తం 108 సాసర్ పిట్లను ఏర్పాటు చేయగా అందులో ...వికారాబాద్‌రేంజ్ పరిధిలోని అనంతగిరి, దామగుండం, కండ్లపల్లి, జైదుపల్లి, గట్టుకొండాపూర్, మోత్కుపల్లి, ఎక్‌మామిడిలోని అటవీ ప్రాంతాల్లో 31 సాసర్‌పిట్లు.. ధారూరు రేంజ్ పరిధిలో 14, కొడంగల్ రేంజ్ పరిధిలో 11 , పరిగి రేంజ్ పరిధిలో 30, తాండూరు రేంజ్ పరిధిలో 22 సాసర్ పిట్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పలు అటవీ ప్రాంతాల్లో ఉన్న ఏడు సోలార్ బోర్ల ద్వారా కూడా సాసర్ పిట్లను నింపి అటవీ జంతువులు దాహార్తిని తీరుస్తున్నారు. మరోవైపు జిల్లాలోని అడవుల్లో 100కు పైగా జింకలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆగని వన్యప్రాణుల వేట, రోడ్డు ప్రమాదాలు..

మరోవైపు జిల్లాలో వన్యప్రాణులకు రక్షణ కరువైంది. ఓ వైపు వేటగాళ్ల రూపంలో.. మరోవైపు రోడ్డు ప్రమాదాలతో మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలోని దామగుండం అటవీ ప్రాంతానికి సమీపంలో భూములు కొనుగోలు చేసి ఫాంహౌస్‌లను ఏర్పాటు చేసుకున్న కొందరు వారాంతపు సెలవుల్లో రాత్రి సమయాల్లో జింకలను వేటాడుతూ.. వాటి మాంసంతో ఫాంహౌస్‌ల్లో పార్టీలు చేసుకుంటు న్నారని సమీప గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు రాత్రి వేళ్లలో వేటగాళ్లను పట్టుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినా.. తదనంతరం పర్యవేక్షణ కొరవడి మళ్లీ వేట సాగుతూనే ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరోవై పు రోడ్డు ప్రమాదాల్లోనూ వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. రాత్రి సమయాల్లో రోడ్డు దాటే సమయంలో వాహనాలు ఢీకొని అవి మృతి చెందుతున్నాయి. ఇటీవల అనంతపద్మనాభ ఆలయం సమీపంలో రోడ్డు దాటుతున్న జింకను మొబైల్ ఫోన్లో చిత్రీకరించే క్రమంలో రోడ్డు ప్రమాదమై జింక మృతి చెందింది. వన్యప్రాణులు రోడ్డు దాటే వరకు వాహనాలను నిలిపివేయాలని అధికారులు సూచిస్తున్నారు.

రెండు రోజులకొకసారి సాసర్ పిట్లను నింపుతున్నాం.

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు 108 సాసర్ పిట్లను ఏర్పాటు చేశాం. అంతేకాకుండా రెండురోజుల కొకసారి వాటిలో ట్యాంక ర్ల ద్వారా నీటిని నింపుతున్నాం. అటవీ జంతువుల తాగునీటికి ఎలాంటి ఇబ్బం ది లేదు. మరోవైపు అటవీ జంతువులు రోడ్డు దాటే సమయంలో వాహనదారులు నెమ్మదిగా వెళ్లడం లేదా వాహనాన్ని నిలిపివేయాలి. అనంతగిరి అటవీ ప్రాంతం గడ్డి భూములకు ప్రత్యేకం కావడంతో సిగరెట్లు ఇతరత్రా తాగి ఆర్పకుండా కింద పడేయొద్దు.

- జ్ఞానేశ్వర్,
వికారాబాద్ డీఎఫ్‌వో

45వేల పార్సిళ్లు.. 80 కోట్ల ఆదాయం

దిల్‌సుఖ్‌నగర్‌లో లాజిస్టిక్స్ కౌంటర్‌ను ప్రారంభించిన ఆర్టీసీ ఎండీ

ఎల్‌బీనగర్, మార్చి 14: టీఎస్‌ఆర్టీసీ ప్రవేశపెట్టిన లాజిస్టిక్స్ విభాగం ద్వారా కస్టమర్లకు వేగవంతంగా, భద్రతతో పార్సిళ్లను గంటల్లో గమ్యస్థానాలకు చేరవేస్తున్నామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. నెట్‌వర్క్, టెక్నాలజీని ఉపయోగించుకొని ఎలాంటి జాప్యం లేకుండా పార్సిళ్లను అందజేసే విధంగా అన్ని చర్యలు తీసకుంటున్నట్లు పేర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపో ఆవరణలో మోడల్ లాజిస్టిక్స్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అదే విధంగా టీఎస్‌ఆర్టీ లాజిస్టిక్స్ నూతన లోగో, బ్రోచర్‌ను సైతం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ ప్రతి రోజు సగటున 15వేల పార్సిళ్లను లాజిస్టిక్స్ విభాగం గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు 45.07 పార్సిళ్లను రవాణా చేశామని, సంస్థకు సుమారు రూ.80 కోట్ల వరకు ఆదాయం వచ్చిందని వెల్లడించారు. కార్గో ద్వారా మరో రూ. 27 కోట్ల వరకు రాబడి సమకూరిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థ ఆధ్వర్యంలో 60 కౌంటర్లు, 401 ఏజెంట్ కౌంటర్లతో నెట్‌వర్క్ విస్తరించి ఉన్నట్లు చెప్పారు. ప్రజల నుంచి లాజిస్టిక్స్ విభాగానికి మంచి ఆదరణ లభిస్తున్నదని చెప్పారు. కస్టమర్ల సౌకర్యార్థం హోం డెలివరీ, పిక్‌అప్ సౌకర్యాలను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి స్కీం ద్వారా దాదాపు 25కోట్ల మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్ ప్రయాణికులు బస్సు సౌకర్యం వినియోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. కృష్ణకాంత్, ఈడీ హైదరాబాద్ జోన్ పురుషోత్తం నాయక్, ఈడీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ లాజిస్టిక్స్ లోగోను ఆవిష్కరించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

రేపు లోక్ అదాలత్

జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మార్చి 14 : కేసుల రాజీ కుదుర్చుకునేందుకు మార్చి 16న న్యాయ శాఖ ఆధ్వర్యం లో లోక్ అదాలత్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమని, కేసులలో రాజీ అవ్వాలనుకున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కక్షిదారులు ఎవరైనా తమ కేసుల రాజీ కొరకు వేచిచూస్తే వారికి మార్చి 16న లోక్ ఆదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లలో కేసులు ఉన్నవారు రాజీ కావాలి అనుకుంటే తమ స్థానిక పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

బొంరాస్‌పేట, మార్చి 14 : ఎండల తీవ్రత దృష్ట్యా శుక్రవారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు పని చేస్తాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి ఇండ్లకు పంపిస్తారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్న దృష్ట్యా పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నిబంధనలు వర్తిస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒంటిపూట బడులు శుక్రవారం నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు కొనసాగిస్తారు.



'ప్లస్' విలువ ఎంత?

శంకర్‌పల్లి ఘటనలో అంతు బట్టని మృతుడి రవి ఇంట్లోని రికార్డులు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 15 (నమస్తే తెలంగాణ)/మణికొండ : ముగ్గురు కొడుకులకు ఉరివేసి... తానూ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగగూరు నీరటి రవి విషాధ ఘటనలో అగ్గి రాజేసిన మనీ సర్క్యులేషన్ స్కీంలో బాధితులు ఎన్ని కోట్ల రూపాయలు మోసపోయారనేది పోలీసులకు సైతం అంతుచిక్కడం లేదు. పోలీసులు రవి ఇంట్లోని పుస్తకాలను పరిశీలించినప్పుడు పెట్టుబడులు పెట్టినవారు 150 మందికి పైగానే ఉన్నట్లు తేలింది. అయితే ఆ పేర్ల ముందు మాత్రం 40+, 20+ అంటూ ఉండటంతో అవి వేలా? లక్షలా?? అనేది అంతుబట్టడం లేదు. ఒక్క శంకర్‌పల్లి పరిధిలోనే రూ.25 కోట్ల మేర మోసపోయారనే సమాచారం అందుతున్న నేపథ్యంలో మనీ సర్క్యులేషన్ పేరుతో వందలాది మంది అమాయకులను నిలువునా ముంచిన జీఎస్ఎన్ సంస్థ మూలాలు కేవలం ఇక్కడే ఉన్నాయా? ఇంకా చుట్టుపక్కల గ్రామాల్లోనూ విస్తరించాయా? అనే అంతుచిక్కని ప్రశ్నలు ఉత్కంఠ రేపుతున్నాయి.

150 మందికి పైగా..

శంకర్‌పల్లి మండలం టంగటూరుకు చెందిన నీరటి రవి ఉదంతంలో ఇప్పటికే పోలీసులు తొమ్మిది మందిపై కేసులు నమోదు చేయగా.. ముగ్గురిని అరెస్టు చేశారు. రవి ఆత్మహత్య తర్వాత ఆయన భార్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తొలుత రవి ఇంట్లో తనిఖీలు చేశారు. ఇంట్లోని పుస్తకాలను పరిశీలించినప్పుడు జీఎన్ఎస్ మనీ సర్క్యులేషన్ సంస్థ ద్వారా టంగటూరు ఇతర గ్రామాల్లో మొత్తంగా 150 మంది కన్నా ఎక్కువ మందే ఊబిలో చిక్కుకున్నట్లుగా గుర్తించినట్లు తెలిసింది. అందులో ఎవరెంత సొమ్ము పెట్టారనే అంశంపై మాత్రం పోలీసులకు స్పష్టత దొరకలేదు. పోలీసులు నమోదు చేసిన కేసులో ఏ1గా ఉన్న తిరుపతిరావుకు చెందిన సంస్థ చిరునామా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా రాజం గ్రామం,మండలం, గాయత్రినగర్ కాలనీ, రెండో వీధి సాయిబాబా దేవాలయం పక్కన ఇంటినంబర్ 16-400 పేరిట ఉంది.

విచారణ కొనసాగిస్తున్నాం: ఇన్‌స్పెక్టర్ వీరబాబు

మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టంగటూరు గ్రామానికి చెందిన రవి ఆత్మహత్య తర్వాత అతడు స్థానిక ప్రజల నుంచి కొనసాగించిన లావాదేవీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామని ఇన్‌స్పెక్టర్ వీరబాబు తెలిపారు. ఇటీవల రవి ఇంట్లో పలు రికార్డులను పరిశీలించగా అందులో దాదాపు 150 మందికి పైగా పేర్లను రాసి పెట్టారని, వారి ద్వారా పొందిన నగదు వివరాలను రెండంకెలుగా రాశారని తెలిపారు. ఒకరి పేరు పక్కన పది ప్లస్ అంటూ, మరొకరి పేరు పక్కన 40ప్లస్ అంటూ బుక్కులో నమోదుచేసుకున్నారని ఇన్‌స్పెక్టర్ వీరబాబు అన్నారు. పేర్లున్న వారికి సంబంధించి ఎలాంటి చిరునామా లాంటివి ఎక్కడా లేవని, ఎలాంటి రసీదులు కూడా కనిపించలేదన్నారు.